క్లుప్తంగా

పర్యావరణాన్ని కాపాడుకుందాం



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుమిత్రమ్మ

పగిడ్యాల: ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఎంపీడీఓ సుమిత్రమ్మ సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోవడంతో పర్యావరణానికి పెను ముప్పు ఏర్పడిందన్నారు. ప్లాస్టిక్ తయారీకి వినియోగించే కెమికల్స్ మానవ శరీర భాగాల్లోకి చేరుకుని ప్రాణాపాయం కలుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి భవిష్యత్ తరాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి జాకీర్ హుసేన్

నందికొట్కూరు: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మండల ప్రత్యేక అధికారి జాకీర్ హుసేన్ తెలిపారు. శనివారం మిడుతూరు మండల పరిషత్ కార్యాలయంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో యోగాపై ఆసక్తి ఉన్న వెయ్యి మంది వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలన్నారు. అనంతరం యోగాపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ దశరథరామయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ భూములకు వేలంపాట



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

బండి ఆత్మకూరు: మండల కేంద్రంలోని లక్ష్మీజనార్దన స్వామి ఆలయ భూములకు, బి.కోడూరు గ్రామంలోని చెన్నకేశవ స్వామి ఆలయ భూములకు శనివారం బండి ఆత్మకూరు గ్రూప్ దేవస్థానముల ఈఓ నాగప్రసాద్ వేలంపాటలు నిర్వహించారు. జనార్దన స్వామి ఆలయానికి చెందిన 34.14 ఎకరాలకు గానూ 19.84 ఎకరాలను రూ.4.43 లక్షలకు రైతులు దక్కించుకున్నారు. మిగతా 17.30 ఎకరాలకు పాట పాడేందుకు ఎవరూ ముందుకు రాలేదు. అలాగే బి.కోడూరు చెన్నకేశవ స్వామి ఆలయానికి చెందిన 20.98 ఎకరాలను రూ.5.90 లక్షలకు రైతులు వేలంలో దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ జగన్‌మోహన్, పర్యవేక్షణ అధికారి మూల సాగరం ఈఓ వి.గోపి పాల్గొన్నారు.

మద్యం దుకాణాల తనిఖీ



మద్యం షాపును తనిఖీ చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండల కేంద్రంలోని ఎస్వీ వైన్స్, పల్లవి గౌడ్ వైన్స్‌లను శనివారం ఆత్మకూరు ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్ తనిఖీ చేశారు. జి.వీరాపురం గ్రామంలో మద్యం విక్రయిస్తున్న తలారి చిన్న నాగన్న, కేతావత్ నాగబాయిల వద్ద నుంచి 26 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని, వారిపై కేసు నమోదు చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహించరాదన్నారు. బెల్ట్‌షాపులకు మద్యం సరఫరా చేసిన షాపులను సీజ్ చేసి లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఎక్సైజ్ ఎస్ఐలు జగదీష్, వీరాస్వామి ఉన్నారు.

మహానంది టోల్‌గేట్ వద్ద గొడవ

- సిబ్బందిపై దాడి...కేసు నమోదు

మహానంది: మహానందిలోని బుక్కాపురం వైపు ఉన్న టోల్‌గేట్ వద్ద ఒకరిపై దాడి చేసిన ఘటన శుక్రవారం చోటు చేసుకోగా శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు.. నంద్యాలకు చెందిన కె.ప్రసాద్ కారులో మహానందికి వస్తూ టోల్‌గేట్ వద్ద ఎడమ వైపు నుంచి కాకుండా కుడివైపు నుంచి వెళ్తుండగా అక్కడ విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌గౌడ్ అడ్డుకుని టోల్ రుసుము చెల్లించాలని కోరాడు. టోల్‌గేట్ నిర్వాహకులు తనకు బాగా తెలుసని ప్రసాద్ చెప్పినా వినకపోవడంతో ఇద్దరి మధ్య మాటమాటా పెరిగి గొడవకు దారి తీయడంతో ప్రసాద్.. శ్రీనివాసులుపై చేయి చేసుకున్నాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి చెప్పారు.

పనితీరును బట్టే పదవుల కేటాయింపు

- కష్టపడి పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు ఎప్పుడూ ఉంటుంది
- మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: కార్యకర్తల పనితీరును బట్టే పదవులు కేటాయించినట్లు వైఎస్సార్‌సీపీ శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పార్టీ మండల, జిల్లా, రాష్ట్ర కమిటీ సభ్యుల నియామకాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే పలువురికి పార్టీ కేంద్ర కమిటీ నుంచి నియామకాల ఉత్తర్వులు అందాయన్నారు. ఆత్మకూరు, శ్రీశైలం, బండిఆత్మకూరు, వెలుగోడు, మహానంది మండలాల్లో వైఎస్సార్‌సీపీ కోసం తనతోపాటు కష్టపడుతున్న పార్టీ కార్యకర్తలకు తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పించడం సంతోషకరమన్నారు. పదవులు పొందిన వారు వచ్చే రోజుల్లో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ ఆగడాలను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. ఎప్పుడు ఎన్నికలొచ్చినా వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమన్నారు. అనంతరం ఇటీవల పదవులు పొందిన వెంకటస్వామిగౌడ్, షేక్‌మహబూబ్‌బాషా, హేమంత్‌సాయి, విజయ్, జె.ఎస్.బాషా, ధనుంజయతోపాటు పలువురు నాయకులు శిల్పాను సన్మానించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, సయ్యద్‌మీర్, అంజాద్‌అలీ, స్వామి, మహబూబాషా, మొమిన్, మున్నీర్‌బాషా, రషీద్, బాలస్వామియాదవ్, స్వామి, రఫిక్, ప్రభుదాస్, విజయ్‌చౌదరి, కరిముల్లా, బాషా తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని సన్మానిస్తున్న పార్టీ కార్యకర్తలు

రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలి

పగిడ్యాల: వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి స్థానంలో చూసేందుకు కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు డాక్టర్ బైరెడ్డి మల్లికార్జునరెడ్డి సూచించారు. శనివారం పడమర ప్రాతకోట గ్రామంలో జరిగిన ఖాశీంవలి వివాహానికి హాజరయ్యారు. అనంతరం ఆయన కార్యకర్తలతో మాట్లాడారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాదవుతున్నా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకపోవడంతో అన్ని వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. జూన్ 4న వెన్నుపోటు దినంగా నిరసన కార్యక్రమాలు చేపట్టి కలెక్టర్‌లకు వినతి పత్రాలను ఇవ్వాలని జగనన్న పిలుపునిచ్చారని, దీనిని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గుజ్జుల రమేష్‌నాయుడు, మండల అధ్యక్షులు పుల్యాల నాగిరెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు అస్లాంబాషా తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న డాక్టర్ బైరెడ్డి మల్లికార్జునరెడ్డి

ప్రకృతిని కాపాడుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత

జూపాడుబంగ్లా: పర్యావరణాన్ని కాపాడుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి సంరక్షించాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలన్నారు. అనంతరం పర్యావరణాన్ని కాపాడుతామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ బషీర్, ఎంఈఓ చిన్నమద్దిలేటి, డిప్యూటీ తహసీల్దార్ నాగన్న, సీనియర్ అసిస్టెంటు మద్దమ్మ పాల్గొన్నారు.

15 రోజుల్లోపు బిల్లు చెల్లించకపోతే అదనపు చార్జీలు

వెలుగోడు: విద్యుత్ వినియోగదారులు 15 రోజుల్లోపు బిల్లు చెల్లించకపోతే అదనపు చార్జీలు చెల్లించాల్సి ఉంటుందని ఏఈ రవీంద్రనాయక్ తెలిపారు. శనివారం ఆయన వినియోగదారులకు బిల్లుల చెల్లింపులపై అవగాహన కల్పించారు. బిల్లు వచ్చిన 15 రోజుల వరకు ఎలాంటి చార్జీలు ఉండవని, తర్వాత 30 రోజులకు అదనపు చార్జీలు ఉంటాయని, నెల రోజుల తరువాత ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే విద్యుత్ కనెక్షన్ తొలగిస్తామన్నారు.

నందీశ్వరస్వామివారికి పరోక్ష సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయంలో శనివారం త్రయోదశి సందర్భంగా నందీశ్వరస్వామికి 36 మంది భక్తులు పరోక్షసేవగా విశేషార్చన జరిపించారు. పూజాదికాలలో ముందుగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతి పూజ, నందీశ్వర స్వామికి పంచామృతాలతోనూ, పలు ఫలోదకాలతోనూ హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం, మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం నందీశ్వర స్వామికి అన్నాభిషేకం నిర్వహించారు. పురుషసూక్తం, వృషభసూక్తం మొదలైన వేదమంత్రాలతో విశేషాభిషేకాన్ని జరిపారు. నందీశ్వరస్వామివారికి నూతనవస్త్ర సమర్పణ, విశేషపుష్పార్చనలనంతరం నానబెట్టిన శనగలను సమర్పించారు.



నందీశ్వర స్వామికి విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మహానందిలో ప్రదోషకాల అభిషేకం



నందీశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న పండితులు

మహానంది: స్థానిక మహానందీశ్వరస్వామి గర్భాలయానికి ఎదురుగా ఉన్న నందీశ్వరస్వామికి శనివారం అభిషేకం పూజలు నిర్వహించారు. వేదపండితులు రవిశంకర అవధాని, ఆలయ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు ప్రదోష కాలంలో నందీశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ, అభిషేకార్చనలు చేశారు. గంధాభిషేకం, పాలాభిషేకం చేపట్టారు. పలు ప్రాంతాల భక్తులు ఆర్జితసేవా టికెట్ల ద్వారా ప్రదోష కాల అభిషేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే శనివారం వీకెండ్ సందర్భంగా భక్తులరద్దీ నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ఉదయం స్థానిక అలంకార మండపంలో గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు కల్యాణం నిర్వహించారు. రాత్రి యాగశాలలో మహానందీశ్వరుడి దంపతులకు ఏకాంత సేవ పూజలు చేపట్టారు.

పుస్తకాలు మంజూరు

జూపాడుబంగ్లా: 2025–26 విద్యా సంవత్సరానికి ఒకటి నుంచి ఆరో తరగతి వరకు అన్ని సబ్జెక్టుల పుస్తకాలను సెమిస్టర్ కింద చేర్చి పాఠ్య, నోట్ పుస్తకాలుగా మంజూరు చేశారు. ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు అన్ని పాఠ్యాంశాలను ఓ సెమిస్టర్‌గా ఏర్పాటు చేశారు. ఆరో తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషు కలిపి ఒక పాఠ్యాంశంగా, మ్యాథ్స్, సోషల్, సైన్స్ పాఠ్యాంశాలను ఒక్కో సెమిస్టర్‌గా ఏర్పాటుచేసి పాఠ్యపుస్తకాలు మంజూరు చేసినట్లు ఎంఈఓ చిన్నమద్దిలేటి తెలిపారు. మొదటి విడతగా మండలంలోని 38 పాఠశాలలకు 12,245 పాఠ్యపుస్తకాలు మంజూరైనట్లు తెలిపారు. 24,898 నోట్‌పుస్తకాలు, 3,853 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి మూడు జతల చొప్పున మంజూరైనట్లు తెలిపారు. ఇంకా స్కూల్ బ్యాగులు, టై, బెల్టు, బూట్లు మంజూరు కావాల్సి ఉందన్నారు.

పెంచిన పన్నులు రద్దు చేయాలి

ఆత్మకూరు: పట్టణాల్లో పెంచిన ఆస్తి(ఇంటి) పన్ను తగ్గించాలని, ఆస్తి విలువ ఆధారిత ఇంటి పన్ను విధానాన్ని రద్దు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ కోరారు. ఇంటి పన్నులు పెంచుతూ తెచ్చిన జీఓ ప్రతులను శనివారం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో దగ్ధం చేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025–26 సంవత్సరాలకు సంబంధించి పట్టణాల్లో ఆస్తి పన్ను గత సంవత్సరంతో పోలిస్తే 15 శాతం, 2020–21 సంవత్సరాల్లో పోలిస్తే 30 శాతం పెంచుతూ గుట్టుచప్పుడు కాకుండా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. దీంతో రూ.320 కోట్ల భారం పట్టణ ప్రజలపై పడుతుందన్నారు. ఎన్నికల్లో కూటమి పార్టీలు ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని సమీక్షిస్తామని, పన్నులు పెంచబోమని హామీ ఇచ్చారన్నారు. నేడు ఇలా పన్నులు పెంచడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే పెంచిన పన్నులను తగ్గించాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు వీరన్న, పాలశివుడు, తుమ్మలూరు శివకుమార్, మల్లయ్య, నాగేశ్వరరావు, రవి, విజయ్, వలి తదితరులు పాల్గొన్నారు.



జీఓ ప్రతులను దగ్ధం చేస్తున్న సీపీఎం నాయకులు



బండి ఆత్మకూరు: సంతజూటూరు వద్ద ఆకాశం మేఘావృతమైన దృశ్యం



మహానందిలో కనువిందు చేసిన నీలాకాశం

ఆకాశం దిగివచ్చి..!

ఈ చిత్రాలను చూస్తుంటే 'ఆకాశం దిగివచ్చి మబ్బులతో వేయాలి మన పందిరి' అనే సినీ గేయం గుర్తుకు రాక మానదు. శనివారం ఉదయం నుంచి మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకున్నాయి. వర్షం పడుతుందా అన్నట్లు మబ్బులు కమ్మిన మేఘాలు దివి నుంచి భువికి దిగొచ్చినట్లు కనిపించగా సాయంత్రం సమయంలో రెండు మండలాల్లోనూ వర్షపు చినుకులు పడ్డాయి. రాత్రి ఏడు గంటలు సమయంలో మహానంది ఆలయ పరిసరాల్లో ఆకాశం నీలిరంగులో కనువిందు చేసింది.

– మహానంది/బండి ఆత్మకూరు

పిల్లల పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలి

- జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేద్కర్

ఆత్మకూరురూరల్: తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేద్కర్ సూచించారు. స్థానిక కోర్టుల సముదాయంలో శనివారం జరిగిన మండల న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈనెల 25న 'తప్పిపోయిన పిల్లల దినోత్సవాన్ని' పురస్కరించుకుని పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రపంచంలో ఏటా ట్రిలియన్ డాలర్ల మానవ అక్రమ రవాణా జరుగుతోందన్నారు. ఇందులో పసిపిల్లలను కూడా అక్రమంగా తరలిస్తున్నారన్నారు. 12 గంటల్లో తప్పి పోయిన పిల్లలను గుర్తించలేకపోతే వారిని తిరిగి కనుక్కోవడం కష్టమన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా నేరుగా కోర్టును సంప్రదించవచ్చని, ఇక్కడ మండల న్యాయ సేవాధికార సంస్థ ఉచితంగా న్యాయం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మాణిక్యరావు, బతుకులయ్య, లేబర్ అధికారి మార్గరెట్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ కల్పన, మేరిబా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేద్కర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చాగలమర్రి: మండలంలోని రాంపల్లె మెట్ట వద్ద జాతీయ రహదారిపై మోటారు సైకిల్ అదుపుతప్పి కిందపడటంతో పెద్ద బోధనం గ్రామానికి చెందిన గడ్డ సుబ్బారాయుడు(31) మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పెద్ద బోధనం గ్రామానికి చెందిన గడ్డ సుబ్బారాయుడు ప్రతి రోజు లాగే కొలిమి పని చేయడానికి మోటార్ సైకిల్‌పై ఆళ్లగడ్డకు బయలుదేరాడు. రాంపల్లె మెట్ట వద్దకు వెళ్లడానికి కుడి వైపు నుంచి ఎడమ వైపుకు వెళ్లే క్రమంలో మోటారు సైకిల్ అదుపు తప్పి కిందపడటంతో సుబ్బారాయుడు తలకు గాయమైంది. గ్రామస్తులు టోల్ ప్లాజాకు చెందిన అంబులెన్సులో ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి తండ్రి సుబ్బారాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు విచారణ చేస్తున్నట్లు ఏఎస్ఐ షేక్ అబ్దుల్ నబి తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు సంతానం.

గోరుకల్లు జలాశయం సందర్శన

పాణ్యం: మండల పరిధిలోని గోరుకల్లు జలాశయాన్ని శనివారం కర్నూలు ఐఐఐటీడీఎం (ఇన్‌డియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్) ప్రొఫెసర్లు సందర్శించారు. కట్ట కుంగిపోవడానికి గల కారణాలపై ఆరా తీశారు. అలాగే కట్ట నిర్మాణంలో ఉపయోగించిన మెటీరియల్, వాటిని తెలుసుకునేందుకు కెమెరాలు ఏర్పాటు చేసేందుకు పరిశీలించగా గాలుల ధాటికి అలలు అధికంగా రావడంతో మరో మారు గోరుకల్లు సందర్శించనున్నట్లు ఈఈ సుభకుమార్ తెలిపారు. అలాగే కట్ట పటిష్టత, నిర్మాణం పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. డీఈఈలు జ్యోతి, గీతా, ఏఈలు అమృత్, సిబ్బంది ఉన్నారు.

రైతుల అభివృద్ధికి ఆంగ్రో చేయూత



రైతులకు పనిముట్లు, పట్టలు పంపిణీ చేస్తున్న దృశ్యం

మహానంది: రైతుల అభివృద్ధికి ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఎంతో కృషి చేస్తుందని మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మి తెలిపారు. వ్యవసాయ కళాశాలలో శనివారం 200 మంది రైతులకు శనగ పంట సరళి, మెలకువలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ కళాశాల నుంచి రూ.16 లక్షల విలువైన బ్యాటరీ స్ప్రేయర్లు, టార్పాలిన్ పట్టలు, కొర్ర, శనగ విత్తనాలతో పాటు గడ్డిమందులు, సస్యరక్షణ మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ కె.ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ గీతాశిరీష, డాక్టర్ గురివిరెడ్డి, డాక్టర్ త్రివిక్రమ్ రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ సుజాతమ్మ పాల్గొన్నారు.

మంద అభివృద్ధికి విత్తన పొట్టేళ్లే కీలకం

- దృఢంగా ఉన్న జీవాలు సంతానోత్పత్తికి ఉపయోగకరం
- జాతి పొట్టేళ్లయితే మరీ మంచిది
- 25 నుంచి 30 గొర్రెలకు ఒక పొట్టేలు తప్పనిసరి



మేత మేస్తున్న జీవాలు



పశువైద్యాధికారిణి అనుష

బండిఆత్మకూరు: గొర్రెల మంద అభివృద్ధిలో పొట్టేళ్ల కీలకం. విత్తన పొట్టేళ్ల మంచిదైతే మందలో గొర్రె పిల్లల సంఖ్య ఏడాది కాలంలోనే 50 నుంచి 70 వరకు పెరుగుతుంది. పొట్టేళ్లకు సంబంధించిన పలు విషయాలను బండిఆత్మకూరు పశువైద్యాధికారిణి అనుష వివరించారు.

జన్యుపరమైన సమస్యలతో జననం

గొర్రెల పెంపకందారులు తమ మందలో పుట్టిన మగ పిల్లలనే విత్తన పొట్టేళ్లుగా వాడతారు. అయితే ఇది సరికాదు. మందలోని పొట్టేళ్ల రక్తసంబంధ సంతతిపై దాటడం వల్ల పిల్లలు జన్యుపరమైన సమస్యలు, అంగవైకల్యంతో జన్మిస్తాయి. రోగ నిరోధక శక్తి తగ్గి వివిధ వాతావరణ పరిస్థితులను తట్టుకోలేక రోగాల బారిన పడతాయి.

మేలు రకం పొట్టేళ్లను ఎంపిక చేసుకోవాలి

గొర్రెల మంద అభివృద్ధి చెందాలంటే మేలు రకం పొట్టేళ్లను ఎంపిక చేసుకోవాలి. కాపరులు తమ ప్రాంతానికి అనువైన జాతిని మాత్రమే ఎంచుకోవాలి. విత్తన పొట్టేళ్ల జాతి లక్షణాలు కలిగి, ఆడ గొర్రెలపై దాటడానికి మంచి లైంగికాసక్తితో ఉండాలి. శరీరం దృఢంగా, చురుగ్గా ఉండాలి. కాళ్లు నిటారుగా, బలంగా, గిట్టలు చక్కగా, కళ్లు మెరుస్తూ ఉండాలి. వృషణాల వెనుక కాళ్ల మధ్య సరిసమానంగా శరీరానికి దగ్గరగా ఉంటే సంతానోత్పత్తికి ఉపయోగకరంగా ఉంటాయి. పొట్టేళ్లు కనీసం 18 నెలల వయస్సుండి రెండు నుంచి నాలుగు పళ్లతో ఉండాలి. అలాగే విత్తన పొట్టేళ్లను గ్రామంలోని పక్కనున్న మందలు, పక్క గ్రామం, పొరుగు జిల్లా నుంచి ఎంపిక చేసుకోవాలి. బయటి నుంచి తీసుకువచ్చే పొట్టేళ్లకు బ్రూసెల్లోసిస్ వ్యాధి పరీక్షలు చేయించాలి.

రెండేళ్లకోసారి మార్చాలి

విత్తన పొట్టేళ్లను రెండేళ్లకోసారి తప్పనిసరిగా మార్చాలి. ప్రతి 25 నుంచి 30 ఆడ గొర్రెలకు ఒక విత్తన పొట్టేలు ఉండేలా చూసుకోవాలి. సాధ్యమైనంత వరకు కవల పిల్లగా పుట్టిన పొట్టేలును ఉపయోగించాలి. గొర్రెలపై దాటుడు కాలంలో పొట్టేలు శరీర పైభాగంలో ఉండే వెంట్రుకలు కత్తిరించి, నునుపుగా ఉంచాలి. దాటుడు కాని సమయంలో పొట్టేలును మందకు దూరంగా ఉంచాలి.

దాణా విషయంలో జాగ్రత్త

పొట్టేళ్లకు మేత, దాణా, వసతి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన వాటిని వారం రోజులు ఇంటి వద్దే మేపిన తర్వాత మందలో కలపాలి. రోజుకు 200 గ్రాముల మిశ్రమ దాణా అందించాలి. జొన్న, తవుడు, నూకలు, వేరుశనగ చెక్కతో తయారు చేసిన మిశ్రమ దాణాను కొద్దిగా నీళ్లతో తడిపి పొడిపొడిగా చేసి పెట్టాలి. వారం తర్వాత చిటుకు వ్యాధి టీకా వేయించాలి.

ప్రమాదానికి గురైన దేవస్థానం వాహనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వినియోగిస్తున్న దేవస్థాన సఫారీ స్ట్రోమ్ వాహనం ప్రమాదానికి గురైంది. శ్రీశైల దేవస్థానంలో తనిఖీల నిమిత్తం తిరుపతికి చెందిన ఐఐటీ నిపుణులను తీసుకుని వచ్చేందుకు శనివారం ఉదయం శ్రీశైలం నుంచి తిరుపతి వెళ్తుండగా వాహనం దేవరాజుగట్టు దాటిన తరువాత మార్గమధ్యలో పశువులు అడ్డురావడంతో ప్రమాదం చోటుచేసుకుందని దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాలమురళీకృష్ణ తెలిపారు. కాగా డ్రైవర్ సురక్షితంగానే ఉన్నాడని, వాహనం ముందుభాగం బాగా డ్యామేజ్ అయ్యిందని ఈఈ తెలిపారు.



దెబ్బతిన్న వాహనం

కేసు నమోదు

మహానంది: శ్రీనగరం గ్రామానికి చెందిన మహానందిపై దాడి చేసిన మామ, అల్లుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన మహానంది, అలిసాల మధ్య డబ్బు చెల్లింపులో వివాదం నెలకొందన్నారు. దీంతో అలీసా అల్లుడు శివ మహానందిపై ఇటుకతో దాడి చేసినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.